క్లుప్తంగా

మునగపాకకు చేరుకున్న సీపీఎం రక్షణ యాత్ర


మునగపాకలో సీపీఎం రక్షణ యాత్ర

మునగపాక: ఫార్మాలో పనిచేసే కార్మికులకు రక్షణతో పాటు భద్రత కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రక్షణ యాత్ర గురువారం మునగపాకకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు లోకనాథం మాట్లాడుతూ సెజ్‌లో పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ఈ నెల 20న అచ్యుతాపురంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీవీ శ్రీనివాసరావు, శంకరరావు, శివాజీ, నాయనబాబు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు


మూలపేటలో గంగాలమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని మూలపేట, మునగపాక గ్రామాల్లో గురువారం గ్రామ దేవతల పండగలు ఘనంగా నిర్వహించారు. మూలపేటలోని గంగాలమ్మతల్లి పండగ, మునగపాకలో దుర్గాలమ్మ తల్లి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


మునగపాకలో స్వచ్ఛతా హీ ప్లకార్డుల ప్రదర్శన

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మునగపాకలో గురువారం ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ ముందుకురావాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పెద్దలు దాడి శివ, బీలా లక్ష్మణరావు, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఎస్ఐ రమేష్, ట్రస్ట్ సభ్యులు

కోటవురట్ల: కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలోని ఎంపీపీ స్కూల్‌లో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎస్ఐ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు కాళ్ల శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎత్తుల అప్పారావు, టీడీపీ నాయకులు జానకి శ్రీను, సుంకర బాబ్జీ, సత్యనారాయణ, హెచ్ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వ్యక్తిపై కేసు

రాంబిల్లి(యలమంచిలి): ఎటువంటి అనుమతులు లేకుండా 105 లీటర్ల డీజిల్‌ను తరలిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపారు. రాంబిల్లి మండలం రాజకోడూరు గ్రామానికి చెందిన ముత్తా భాస్కరరావు(27) 105 లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తరలిస్తుండగా.. రాంబిల్లి పోలీసులు పట్టుకున్నారు. అనంతరం డీజిల్‌ను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన గురువారం రాత్రి తెలిపారు.

ఘాట్ రోడ్డు విస్తరణ కలేనా?

- ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరం
- వరాహనదితో పొంచి ఉన్న ముప్పు


ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు


ఘాట్‌రోడ్డు సగానికి నదిలోకి జారిపోవడంతో అడ్డుగా నిర్మించిన గోడ

కోటవురట్ల: ఘాట్ రోడ్డు విస్తరణ.. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్య ఇది. విస్తరణ మాట అటుంచి కనీసం చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోక వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. నర్సీపట్నం-అడ్డు రోడ్డు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉన్న ఇందేశమ్మవాక ఘాట్ రోడ్డు అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో ఘాట్ రోడ్డు ప్రమాదంలో పడిపోయింది. అతి ప్రధానమైన ఈ ఘాట్ రోడ్డు విస్తరణ పట్ల ఇప్పటికీ ఎవరూ నోరు విప్పకపోవడం శోచనీయం. హోం మంత్రి అనిత సొంత నియోజకవర్గంలోనే ఈ దుస్థితి పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హోం మంత్రి స్వయంగా ఘాట్‌రోడ్డు పరిస్థితి చూసి కూడా ఎటువంటి హామీ ఇవ్వకపోవడంపై నియోజకవర్గ ప్రజలు మండిపడుతున్నారు. అధికారం రాకముందు ప్రతీ చిన్న విషయంపై రాద్ధాంతం చేసిన ఆమె.. ప్రస్తుతం తన సొంత నియోజకవర్గంలోనే అభివృద్ధిపై నోరుమెదపకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని రామచంద్రపురం శివారున ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు ఉంది. దీనిని దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఏజెన్సీ ప్రాంతానికి రాకపోకలకు అనువుగా బ్రిటిష్ పాలకులు నిర్మించారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వరాహ నదిని ఆనుకుని కొండ వాలున రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి నేటి వరకు ఇది అభివృద్ధికి నోచుకోలేదు. మూడు మండలాలకు వారధిగా ఉన్న ఈ ఘాట్‌రోడ్డు ప్రస్తుతం మూతపడే పరిస్థితికి చేరింది. ఎగువ ఏజెన్సీలో మరోసారి భారీ వర్షాలు కురిస్తే వరాహ నదికి వరదనీటి తాకిడి వచ్చి ఘాట్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. అదే జరిగితే నర్సీపట్నం, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా తెగిపోతాయి.

భారీ వాహనాలు బంద్

ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డు సగానికి వరాహ నదిలోకి జారిపోయింది. దీంతో భారీ వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లే అవకాశం లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. రామచంద్రపురం జంక్షన్ వరకు మాత్రమే బస్సు సర్వీసులను నడుపుతున్నారు. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. లారీలు, వ్యానులు, ట్రిప్పర్లు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. కేవలం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు మాత్రమే వెళ్లే అవకాశం ఉంది. సుమారు కిలోమీటరు పొడవుండే ఈ ఘాట్‌రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తే కానీ భారీ వాహనాలు వెళ్లే అవకాశం కనిపించడంలేదు. ఘాట్‌రోడ్డు సగానికి నదిలోకి జారిపోయిన క్రమంలో హోం మంత్రి అనిత తన సొంత నియోజకవర్గం కాబట్టి హడావుడి చేసి చూసి వెళ్లిపోయారని, ఇది కంటి తుడుపు చర్యగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. ఘాట్ రోడ్డు పరిస్థితి చూశాక కూడా హోం మంత్రి దాని అభివృద్ధిపై ఎటువంటి హామీ ఇవ్వకపోవడంతో అందరూ తెల్లమొహం వేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఘాట్‌రోడ్డు విస్తరణపై ప్రకటన చేయాలని పలువురు కోరుతున్నారు. ఘన చరిత్ర కలిగిన ఘాట్‌రోడ్డు మళ్లీ కళకళలాడాలని, కల తీరాలని ఆశపడుతున్నారు.

ఘన చరిత్రను కాపాడుకోవాలి



ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డుకు ఘన చరిత్ర ఉంది. దీనిని బ్రిటిష్ పాలకులు నిర్మించారు. ప్రస్తుతం ఘాట్‌రోడ్డు ప్రమాద స్థితిలో ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడతారు. ఇప్పటికే బస్సులు నిలిచిపోవడంతో అడ్డురోడ్డు వెళ్లే ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. నిధులు మంజూరు చేసి విస్తరణ పనులు చేపట్టాలి.
–సత్యనారాయణరాజు, మాజీ వైస్ ఎంపీపీ, కోటవురట్ల

ఘాట్‌రోడ్డు విస్తరించాలి



ఘాట్‌రోడ్డును వెంటనే అభివృద్ధి చేయాలి. ప్రత్యేక నిధులు మంజూరు చేసి విస్తరణ పనులు నిర్వహించాలి. రాకపోకలకు ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు అడ్డురోడ్డుకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పుడు చర్యలు చేపట్టకపోతే ముస్ముందు అడ్డురోడ్డుకు వెళ్లే పరిస్థితులు కనిపించవు.
– చవ్వాకుల వెంకటరమణ, రామచంద్రపురం

100 రోజుల్లో ఏం సాధించారు?

- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ నేత వీసం ప్రశ్న


మాట్లాడుతున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఏం సాధించారో ప్రజలకు సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 100 రోజుల పాలనపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. ఈ వంద రోజుల్లో 22 వేల కోట్ల రూపాయలు అప్పు తప్ప ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను గాలికొదిలేశారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తోందని, అయినా అన్నదాత పథకం కింద రైతులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని నిలదీశారు. వేట నిషేధం ముగిసినా మత్స్యకారులకు భరోసా లేదన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లిలో డిగ్రీ కళాశాలకు నూతన భవనాలు మంజూరు చేయిస్తామన్నారు. పాయకరావుపేట మెయిన్‌రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తామన్నారు. ఉద్దండపురంలో అసంపూర్తిగా ఉన్న వాటర్‌గ్రిడ్‌కు నిధులు మంజూరు చేసి పూర్తిచేస్తామన్నారు. అడ్డురోడ్డు నుంచి దార్లపూడి వరకు కొత్త రోడ్డు వేస్తామని హామీలు గుప్పించారన్నారు. ఈ హామీల్లో ఒక్కటైనా ప్రతిపాదనలు సిద్ధం చేసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. చివరకు తిరుమల వెంకన్నను కూడా రాజకీయ అవసరాల కోసం వాడుకుంటూ తిరుమల ప్రతిష్ఠను దెబ్బ తీస్తున్నారన్నారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీల అమలకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మునగపాక: వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి, మూలపేట, వెంకటాపురం, రామారాయుడుపేట, నారాయాడుపాలెం, తదితర గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

యలమంచిలి రూరల్: దార్లపూడి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం కొత్తలి ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని కొత్తలి, పేరంటాళ్లపాలెం, ములకలాపల్లి, మన్యంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవకాశం ఉన్న చోట ఉదయం 5 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మెయింటెనెన్స్ పనులు కారణంగా 12 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి డీఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, పెద ఉప్పలం, చినఉప్పలం, రేవుపోలవరం, కొత్తపోలవరం, తిమ్మాపురం, కోనవానిపాలెం, సోమిదేవపల్లి, వమ్మవరం, గెద్దపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఎంఆర్‌సీ భవనం సందర్శన


ఎంఆర్‌సీ కార్యాలయాన్ని సందర్శిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష మోనటరింగ్ అధికారి పట్నాయక్

మునగపాక: మునగపాక ఎంఆర్‌సీ భవనాన్ని గురువారం జిల్లా సమగ్ర శిక్ష మోటనరింగ్ అధికారి మురళీమోహన్ పట్నాయక్ సందర్శించారు. విద్యాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలతో పాటు ఉపాధ్యాయుల పనితీరుకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు అందించిన కిట్‌ల వివరాలపై ఆరా తీశారు. అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, అచ్యుతకృష్ణ, సత్తిబాబు, వీరప్పారావు, రామలక్ష్మి, గోవింద, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు


హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాయకరావుపేట: హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపడం తగదని లింక్ వర్కర్ స్కీమ్ డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.గోవిందరావు, లింక్ వర్కర్స్ స్కీమ్ సూపర్‌వైజర్ డి.రమణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ‘మీకు తెలుసా’ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2 నెలల పాటు మీకు తెలుసా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.అప్పలనాయుడు ప్రస్తుతం సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట, మాసాహేబుపేట వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీసీ దుర్గ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం


సంపద తయారీ కేంద్రంలో వానపాములు విడుదల చేస్తున్న నాగలక్ష్మి, తదితరులు

మునగపాక: సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని పాటిపల్లి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. అనంతరం వానపాములను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో సేకరించిన చెత్తను ఎరువుగా తయారు చేసుకోవాలన్నారు. ప్రజల్లో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ ప్రసాద్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం


మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు

పాయకరావుపేట: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి విద్యార్థి క్రీడల పట్ల శ్రద్ధ వహించాలని జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 3 రోజుల పాటు ఈ క్రీడలు కొనసాగుతాయని నియోజకవర్గ క్రీడల కో–ఆర్డినేటర్ పి.రవికిరణ్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ తదితర ఆటలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.ఎస్.గాంధీ, పీటీలు కె.రత్నాలమ్మ, రెహమాన్, సతీష్, కన్నారావు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం హెచ్ఎం ఎం.లక్ష్మి ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో కోటవురట్ల, కె.వెంకటాపురం, జల్లూరు, పాములవాక హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఈ కార్యక్రమంలో పీడీ గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘చెడు ఆకర్షణలకు గురి కావొద్దు’


ప్రేరణా కార్యక్రమంలో పాల్గొన్న గురుకులం బాలికలు, ఎస్ఐ సావిత్రి, తదితరులు

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో గురువారం ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా యలమంచిలి టౌన్ ఎస్ఐ కె.సావిత్రి హాజరయ్యారు. బాలికల రక్షణ గురించి అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో యువతలో కలుగుతున్న మార్పులు, అమ్మాయిలపై అఘాయిత్యాలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. చెడు ఆకర్షణలకు గురి కాకుండా ఉండే జీవితం ఎంతో ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ గురుకులం నుంచి 15 మంది బాలికలు ఏపీ స్టేట్ యోగాసనాల పోటీల్లో పాల్గొన్నట్టు ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం తెలిపారు. వారిలో ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. యోగా టీచర్ ఎం.రామును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీ రమాదేవి, విజయకుమారి పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌కు సత్కారం

యలమంచిలి రూరల్: యలమంచిలి బాలిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం గురువారం జరిగింది. ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న ధర్మవరం అగ్రహారం టీచర్ విమలాదేవిని కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం, రాంబిల్లి, యలమంచిలి ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ @ 80 వేలు

ఎస్.రాయవరం: మండల వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డు గణేశుని లడ్డూను వేలం పాటలో ఓ భక్తుడు రూ.80 వేలుకు దక్కించుకున్నారు. స్థానిక గుర్రం వారి వీధిలో కొలువుదీరిన గణనాథుని సన్నిధిలో గురువారం ప్రత్యేక పూజలు అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించారు. గుర్రం సత్యనారాయణ అత్యధికంగా రూ.80 వేలుకు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు శానాపతి బాబూరావు, గుర్రం రామకృష్ణ, కట్టా అప్పలకొండ, లడ్డూ దాత లంక వెంకటరమణ, సిద్ధి వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మండలంలో గణపతి నిమజ్జనాలు ఘనంగా జరుగుతున్నాయి. పెదగుమ్ములూరు, కొరుప్రోలు జగనన్న కాలనీలో గణనాథుడిని భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులో పెదగుమ్ములూరులో మహిళల కాగడాల కోలాటం, కొరుప్రోలులో కోలాటం అలరించాయి.

ఒంపోలుపేటలో..

మునగపాక: ఒంపోలుపేటలో గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన వేలం పాటలో లడ్డూను వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతి రామకృష్ణ రూ.5016కు దక్కించుకున్నారు. శ్రీలక్ష్మీ గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట జరిగింది.

మాదక ద్రవ్యాల రవాణాపై ఆకస్మిక తనిఖీలు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్స్, డీటీడీసీ పార్సిల్ సర్వీసెస్ సెంటర్లలో గురువారం నార్కో ట్రిక్స్ డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యలమంచిలి సీఐ ధనుంజయరావు, పట్టణ ఎస్ఐ కె.సావిత్రి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల రవాణాను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు సీఐ చెప్పారు. పోలీసు జాగిలంతో తనిఖీలు చేపట్టడంతో ప్రయాణికులు, స్థానికులు ఆసక్తిగా చూశారు.

అనకాపల్లి: ఏఎంఏఎల్ కళాశాల కొత్తూరు–2లో రామాపురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు వైద్య సేవలు అందించాలని బృందం సభ్యులు సెంటర్ ఎంఎల్‌పీహెచ్ వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ లూసీ, డీపీఎంవో జగదీష్, ఎస్‌వో రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎసైన్షియా ప్రమాద నివేదకను బహిర్గతం చేయాలి

అచ్యుతాపురం(మునగపాక): ఎసైన్షియా ప్రమాద దరాప్తు నివేదికను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు లోకనాథం డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్యుతాపురంలోని ఫార్మా కార్మికులకు రక్షణతో పాటు భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం అచ్యుతాపురంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రొంగలిరాము, శంకరరావు, శివాజీ, సత్యనారాయణ, సోమునాయుడు, బుద్ధ రంగారావు, కర్రి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2024–25 విద్యా సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వైబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఒరిజినల్ ఎస్ఎస్‌సీ, కుల సర్టిఫికెట్లు, ఫొటో, ఈ–మెయిల్ ఐడీ, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నంబర్, ఆధార్ కార్డు అవసరమన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని, లేని ఎడల పేరు మెరిట్ లిస్ట్‌లో కనిపించదన్నారు. ఈ నెల 28న కౌన్సెలింగ్ జరగనుందని తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి


పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు అండర్ –14, అండర్ –17, స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బాల్‌బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని నిర్వాహకులు చెప్పారు. బాలికల విభాగంలో మండలం నుంచి 10 హైస్కూళ్లకు చెందిన 150 మంది పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కొత్తపేట స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ కొఠారు కళావతి, హెచ్ఎం వైవీ రమణ, ఎంఈవో –2 అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, నక్కపల్లి

రేఖా నెం. 09/2024, తే 18-09-2024ది

టెండరు మరియు బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఈ దిగువ సుదహరించిన షెడ్యూల్-I దాఖలా గల పనులు నిర్వహణకు 2024-2025 ఆ.సం.నకు అవసరమైన లేబరును మరియు షెడ్యూలు నందు చూపబడిన సామగ్రిని సరఫరా చేయుటకు **తే 25-09-2024ది బుధవారం ఉదయం గం॥ 11.00 ని॥ నుండి గం॥ 01.00 ని॥** వరకు నక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయమునందు నక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డ్ టెండర్లు స్వీకరించబడును. గడువు సమయము వరకు దాఖలైన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం గం॥2.00లకు అప్పటికి హాజరుగా ఉన్న టెండరుదారుల సమక్షమున తెరువబడును. టెండర్లు దాఖలు చేయువారు షెడ్యూల్ నందు పనికి ఎదురుగా చూపబడిన ధరావత్తు రూపాయలను ఈ కార్యాలయంలో చెల్లించి అందుకు తగ్గ రశీదును పొంది సదరు రశీదును టెండరు ఫారమునకు జతపరచి టెండరు దాఖలు చేయవలెను. అసంపూర్తిగా వున్న టెండర్లు మరియు ధరావత్తు చెల్లించని టెండర్లు చెల్లనేరవు.

షెడ్యూల్-II దాఖలా నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల రోజువారీ మార్కెట్లు నందు 2024-2025 ఆ.సం.లో ఆశీల్లు రుసుములు వసూళ్ళు చేసుకొను హక్కుకు బహిరంగ వేలం ద్వారా లీజులు కేటాయించుటకు అదే రోజు అనగా **తే 25-09-2024ది బుధవారం మధ్యాహ్నం గం॥ 03-00లు నుండి** నక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద నక్కపల్లి మండల పరిషత్ విస్తరణాధికారి (PR & RD) వారి సమక్షమున నక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందినవారిచే గాని బహిరంగ వేలంపాట నిర్వహించబడును. సదరు బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచిన వారు గుత్తకు ఎదురుగా చూపబడిన ధరావత్తు ఈ కార్యాలయంలో చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను. రోజువారీ మార్కెట్ బహిరంగ వేలంపాటలో పాల్గొనదలచినవారు 2024 సం॥ జనవరి 1వ తారీఖు తదుపరి శ్రీ మండల తహశీల్దార్ వారి హోదాకు తక్కువ లేకుండా గల అధికారి వారిచే ధృవీకరించబడిన రు. 1,00,000/- విలువకు తక్కువలేని మోతుబరి ధృవపత్రం గ్రామపంచాయతీ కార్యాలయము నందు సమర్పించవలసి వున్నది. అట్టి మోతుబరి ధృవపత్రము లేనివారు అదనపు ధరావత్తుగా 50,000/- (అక్షరములా ఏబది వేల రూపాయలు) మాత్రము పంచాయతీ కార్యాలయంలో చెల్లించి వేలముపాటలో పాల్గొనవలెను. షరతులు వగైరాలు వివరములను ఈ కార్యాలయం పనిదినములలో, పనివేళలలో స్వయముగా కార్యాలయమును సంప్రదించి తెలుసుకొనగలరు. పై షెడ్యూలు నందలి టెండర్లు మరియు బహిరంగ వేలము పాటలను ఏ కారణము చూపకనే వాయిదా వేయుటకు గానీ రద్దు పర్చుటకు గానీ పంచాయతీ కార్యదర్శివారికి పూర్తి అధికారము కలదని తెలియజేయడమైనది.

షెడ్యూల్లు -I

క్రమ సంఖ్య	టెండరు వివరము	ధరావత్తు మొత్తము
1.	2024-2025 ఆ.సం.లో నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్య పారిశుధ్య పనులు నిర్వహణకు అవసరమైన లేబరు సరఫరా చేయుటకు మనిషి 1కి నెల 1కి సరఫరా రేటు	2,000/-
2.	2024-2025 ఆ.సం.లో నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల మంచినీటి సరఫరా స్కీములు పైపులైన్లు మరియు వీధి కొళాయిలు పనులు నిర్వహణకు అవసరమైన లేబరు సరఫరా చేయుటకు మనిషి 1కి నెల 1కి సరఫరా రేటు	500/-
3.	2024-2025 ఆ.సం.లో నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల విద్యుత్ వీధిలైట్లు మరియు అందుకు సంబంధించిన స్విచ్ బోర్డులు పనులు నిర్వహణకు అవసరమైన లేబరు సరఫరా చేయుటకు మనిషి 1కి నెల 1కి సరఫరా రేటు	500/-
4.	2024-2025 ఆ.సం.నకు నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజారోగ్య పారిశుధ్య పనులు నిర్వహణకు అవసరమైన క్రిమి సంహారక మందులు మరియు నిర్వహణ సామగ్రి సరఫరా చేయుటకు.	2,000/-
5.	2024-2025 ఆ.సం.నకు నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల మంచినీటి సరఫరా పైపులైన్లు మరియు వీధి కొళాయిలు పనులు నిర్వహణకు గ్రామపంచాయతీకి అవసరమైన సామగ్రి సరఫరా చేయుటకు	2,000/-
	షెడ్యూల్లు -II	
1.	నక్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల రోజువారీ మార్కెట్లు నందు 2024-2025 ఆ.సం.లో ఆశీల్లు రుసుములు వసూళ్లు చేసుకొను హక్కుకు.	10,000/-

గమనిక:- (1) షెడ్యూలు I నందు గల 1 నుండి 3 వరకు గల పనులను పంచాయతీ కార్యదర్శి వారి పర్యవేక్షణలలో పంచాయతీ కార్యదర్శి వారి ఆదేశానుసారము నిర్వహించవలసి యుండును.
(2) టెండరు రేట్లను గ్రామ పంచాయతీ ఆమోదించిన తదుపరి అందుకు చెల్లించవలసియున్న లేబరు పేమెంట్లును శ్రీయుత జిల్లా కలెక్టర్, (పం.వి.) అనకాపల్లి వారి అనుమతులుకు లోబడి గ్రామ పంచాయతీ నగదు నిల్వలు ననుసరించి సి.యఫ్.యమ్.యస్. బిల్లు ద్వారా ఆమోదిత కాంట్రాక్టర్ యొక్క వ్యక్తిగత బ్యాంక్ ఎకౌంట్లో జమచేయబడునని తెలియజేయడమైనది.
(1) షెడ్యూలు-II నందు గల రోజువారీ మార్కెట్ బహిరంగ వేలంపాటలో ఖరారు కాబడిన గుత్త మొత్తంలో పాటకాలమందు చెల్లించిన దరావత్తులు మొత్తములు మినహా బ్యాలన్స్ మొత్తమును తే 25-09-2024ది బుధవారం సాయంత్రం లోపల పూర్తిగా చెల్లించవలయును. గుత్త ఖరారు కాబడిన తదుపరి గుత్త మొత్తమునకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ వారి నియమ నిబంధనలు మేరకు ఈ కార్యాలయమునకు అగ్రిమెంట్ సమర్పించిన తదుపరి మాత్రమే తే 26-09-2024ది గురువారం నుండి ఆశీలు రుసుములు వసూళ్లు చేసుకొను హక్కును పొందవలెను.

(సం.) పి.వి.పి. రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ – నక్కపల్లి